


చిత్రకారుడు : బాపు (1961)

ఆంధ్ర సచిత్ర వారపత్రిక (25.01.1961)

# బాపూ బొమ్మా!...

"టెలిగ్రాం సార్?...." అన్న పిలుపు విని త్రుళ్ళిపడ్డాడు రామం.

"ఎవరికి?" అని బెరుకుగా అడిగాడు.

"మీకే!" అన్నాడు పోస్టుమన్ పరిహాసంగా నవ్వుతూ. సంతకం చేసి టెలిగ్రాము తీసుకొన్నాడు. బహుశ, మామయ్యకేమోననుకున్నాడు. కాగితం బయటకు తీసిచూస్తే దానిమీద తన పేరు కొట్టవచ్చినట్లు కనపడేసరికి కతని కళ్ళు ఆత్రుతగా ముందుకు సాగిపోయాయి.

"స్టార్టెడ్ బై జనతా ఫర్ రాజమండ్రి. కమ్ టు స్టేషన్ - వేణు" అని ఉంది అందులో.

ఎవరు వస్తున్నారు? వేణు వస్తుంటే వాడెట్లా టెలిగ్రాము ఇస్తాడు?.... అసలే తుంటరి పీనుగ. ఎందుకు వస్తున్నాడో తెలియదు. చాలా ఆశ్చర్యంగా ఉందే. అనుకున్నాడు రామం.

సరే, స్టేషనుకు పోతే పోయిందేముంది? అని సరిపెట్టుకున్నాడు. అప్పుడు రాత్రి తొమ్మిదిగంటలయింది. రాజమండ్రీ జనతా ఉదయం ఆరుంబావు ప్రాంతంలో వస్తుంది. కనుక తెల్లవారుఝామునే లేవాలని నిద్రకుపక్రమించాడు రామం. తెల్లవారకట్ల మెలకువ వస్తే లేపమని వాళ్ళత్తయ్యతో చెప్పాడు. మామయ్య సినిమాకు వెళ్ళాడు కాబోలు! అప్పటికింకా రాలేదు.

నిద్రపోదామని పడుకున్నాడన్నమాటే కాని వేణు మీదకే పోయాయి రామం ఆలోచనలు. తన మామయ్య సూర్యనారాయణ అనంతపురంలో ఉద్యోగం చేస్తున్నప్పుడు రామం ఆర్ట్స్ కాలేజీలో ఇంటర్‌లో చేరాడు. అప్పుడే వేణుతో పరిచయమైంది. రెండు సంవత్సరాలూ ప్రాణమిత్రులకంటే అధికంగా - (ఏదైనా ఉంటే మాట) గడిపారు. తర్వాత మామయ్యకు ట్రాన్స్‌ఫర్ అవడంతో తాను వెనక్కి వచ్చివేయవల్సి వచ్చింది. వేణు అనంతపురంలోను, తాను రాజమండ్రిలోను బి.ఎస్‌సి.లో చేరారు. మొదటి సంవత్సరం అయిపోయింది. దురదృష్టవశాత్తుగా తన తండ్రి వేసవి శలవుల్లో హఠాత్తుగా మరణించాడు. దానివల్ల కుటుంబ పరిస్థితులు సానుకూలపర్చుకోవడం కోసం మరుసటి సంవత్సరం చదువు మానవలసి వచ్చింది. మళ్ళీ కాలేజీలు తెరిచేసరికి తన మామయ్య తిరిగి రాజమండ్రి ట్రాన్స్‌ఫర్ అవడం వల్ల కాలేజీలో చేరి ఫైనలియరు చదవసాగాడు. అప్పటికే వేణు పట్టభద్రుడయ్యాడు. ఈ రెండేళ్ళు తామిద్దరి మధ్యా ఉత్తరాలు కట్టలకొద్దీ నడిచాయి. వాడిప్పుడు ఎమ్.ఎస్‌సిలో చేరడానికి ప్రయత్నాలు చేస్తున్నానని వ్రాసాడు. కాని, హఠాత్తుగా రాజమండ్రికి బయలుదేరి వస్తున్నాడని వ్రాయడం అంతుపట్టడం లేదు. ఇంతకీ ఆ వచ్చేది వేణు అవునో, కాదో తనకర్థం కావడం లేదు.... సరే! ఎట్లాగా స్టేషనుకు వెళ్ళాలిగా! ఇప్పుడీ ఆలోచనలతో బుర్రపగులకొట్టుకోవడమెందుకు? అనుకొని బలవంతంగా నిద్రాదేవతను కౌగలించుకున్నాడు రామం.

మనస్సు వేణుమీదనే లగ్నమై ఉండటం వల్ల నాలుగ్గంటలవరకు వేణుతోనే కలల్లో విహరించాడు రామం. ఒక్క ఉదటున మెలకువ వచ్చి నిద్ర ఎగిరిపోయింది. టైము చూసి గబగబ కాలకృత్యాలు తీర్చుకొని డ్రెస్ చేసుకొని బయలు దేరాడు. ఈ మధ్య ఎప్పుడూ అంత తెల్లవారుఝామున బయటకు రాకపోవడం వల్ల అతనికి చలిగాలి రుచి తెలియలేదు. ఆ గాలికి శరీరం ముడుచుకుపోయినట్లుంది. గబగబ అడుగులు వేసుకుంటూ గోదావరి స్టేషను చేరాడు.

స్టేషను దగ్గర ఉన్న లక్ష్మీకేఫ్‌లోకి దూరి కలత నిద్రవల్ల కల్గిన క్షుద్బాధ ఉపశమింపజేసుకున్నాడు రామం. స్టేషన్‌లోకి వెళ్ళి రాజమండ్రికి టిక్కెట్టు తీసుకున్నాడు. వేణుయే వస్తున్నాడని అతను (ముమ్మాటికీ - తనలో) నిశ్చయించుకున్నాడు. వేణును గోదావరి

స్టేషనులోనే కల్సుకొని రాజమండ్రిలో దిగవచ్చని అతని అభిప్రాయం.

అప్పుడే అరుణకిరణాలు గోదావరి నదీ జలాల్లో ప్రతిబింబించి వింత కాంతుల్ని ప్రసరిస్తున్నాయి. బ్రిడ్జిమీద రైలు ఎప్పుడు కనిపిస్తుందా అనుకుంటూ రామం ఫ్లాట్‌ఫారంపై పచార్లు చేయసాగాడు. అరగంటసేపు అట్లాతిరుగుతూనే ఉన్నాడు. ఫ్లాట్‌ఫారం పొడవు కొలవాలని అతడెప్పుడూ అనుకోకపోయినా ఎక్స్‌పెరమెంటల్ ఎర్రర్ లేకుండా నాల్గుసార్లు కొలిచాడు.

అప్పటికి జనతా ఎక్స్‌ప్రెస్ ఒక్కసారి అతిచి బ్రిడ్జిపైన ప్రత్యక్షమైంది. అంతకంతకూ దగ్గరౌతున్న రామానికి క్షణాలు గంటల్లా గడుస్తున్నట్లే అనిపించింది. వేణు ముఖం ఏ కిటికీలోంచి కన్పిస్తుందా అని రామం కళ్ళు ఆత్రుతగా పరికిస్తున్నాయి.

లాస్ట్‌బట్ వన్ కంపార్ట్‌మెంట్‌లో నిలబడి వేణు చేతులూపుతున్నాడు. అది రామం గుర్తించాడు. ఇద్దరూ కళ్ళతోనే మాట్టాడుకున్నారు. ట్రైను ఆగగానే రామం ఆ కంపార్ట్‌మెంటులో కెక్కాడు. ఇద్దరూ కౌగలించుకున్నంత పని చేశారు.

"ఏరా! ఏమిటీ నీ వెధవ టెలిగ్రామూ నువ్వూనూ!....." అన్నాడు రామం నవ్వుతూ.

"రాం భాయ్! స్టేషనుకు వచ్చావు కదరా! నన్ను చూశావు. ఇక నీ సందేహం నేనిందుకింత హఠాత్తుగా ఊడిపడ్డానా అని కదూ! ఐ వాజ్ అప్పాయింటెడ్ హియర్ యాజ్ డెమన్ యిన్ ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్...." అని నవ్వేశాడు వేణు.

"వ్వాట్!" అని ఇంగ్లీషులో ఆశ్చర్యపోయాడు రామం. కొంతసేపటికి తేరుకొని "ఐ మీన్, యూ డెమన్! అంటే ఇకనుంచి మాపాలిటి దెయ్యమన్నమాట నువ్వు. అరి చవటా! నాతో చదువుకుని నాకు చదువు చెప్పే డిమాన్‌స్టేటరుగా వస్తున్నావన్నమాట! హతోస్మి. ఇక మేము బాగుపడ్డట్టే!" అన్నాడు రామం ఫ్రెంచిలో నిట్టూరుస్తూ.

వేణు తన ముఖకవళికలు మార్చి జర్మనులో దీనంగా చూశాడు. "అరేయ్ నన్నట్లా తీసి పారెయ్యకురా! ఎంతైనా నీకు కాబోయే గురువుని. ఇక్కడ, అంటే రాజమండ్రి ఆర్ట్స్ కాలేజీ కుర్రకారు మంచి దేవాంతకుల జాతికి చెందినవారని వినికిడి, ఒక్క పోచ లూజ్‌గా వారికి చిక్కిందంటే యిక అన్నీ లాగిపారేస్తారుటగా! పాహి, పాహి!"

"అభయోస్తు!" అన్నాడు రామం.

ఇద్దరూ పకపక నవ్వుకున్నారు. అప్పటికి జనతా రాజమండ్రి స్టేషనులోనికి ప్రవేశించింది. సైకిలు రిక్షాలో యిన్నీసుపేటలోని సూర్యనారాయణగారిల్లు చేరుకున్నారు. వేణును తన అత్తమామలకు పరిచయం చేశాడు రామం. క్షణంలోనే వేణు వాళ్ళతో చనువయిపోయాడు. స్నానాదులన్నీ పూర్తయ్యాయి. కొంతసేపు అంతా కబుర్లు భోంచేసారు.

"ఇంతకీ మావాడు మామయ్యగారింట్లో ఉండి చదువుకుంటున్నాడంటే ఏ సీగాన పెనూనాంబ బాపతయినా మీకు కూతరయి వుంటుందనుకున్నాను" అన్నాడు వేణు.

అంతా నవ్వుకున్నారు. "అదేం లేదు. మీరిద్దరూ ఏ స్వయంవరానికో అటెండ్ కావల్సిందే!"

అన్నాడు సూర్యనారాయణగారు చిరునవ్వుతో.

తొమ్మిదిన్నరకి భోజనాలు చేసి రామం, వేణు సైకిలు రిక్షాలో కాలేజీకి బయలుదేరారు. కాలేజీని సమీపిస్తుంటే అనేకమంది స్టూడెంట్స్ రిక్షాల్లో తిరిగి రావడం వాళ్ళ కళ్ళబడింది. వేణు ఒకసారి దడుసుకున్నంత పని చేశాడు. రామం భుజం తట్టి ఏమిరా అన్నట్లు చూశాడు. అభయం ప్రసాదించి రామం ఒక స్టూడెంట్‌ని వివరాలడిగాడు.

"గత యాన్యుయల్ ఎగ్జామినేషన్సులో పదిమందిని ప్రిన్సిపాల్ డిటెయిన్ చేసాడు. అందుకని అంతా స్ట్రైకు చేస్తున్నారు...." అని చెప్పాడతడు.

రామం, వేణు ఒకరి ముఖాలింకొకరు చూసుకున్నారు. "నడవరా! నువ్వు కాబోయే స్టాఫ్ మెంబరువి. ఇదీ ఒక పరీక్ష అనుకో!" అని రామం అభయం ప్రసాదించాడు.

కాలేజీ గ్రౌండ్స్‌లోకి ఏ స్టూడెంట్‌ని అడుగు పెట్టడానికి వీల్లేకుండా ఆర్గనైజర్సు అంతా సామదాన భేదదండోపాయాలుపయోగిస్తూ చుట్టూ కాసేసారు. ప్రతివాడు అక్కడకు వచ్చి ఏవో కబుర్లు చెప్పి వెనుదిరిగిపోయేవాడే! ఆఖరికి రామం, వేణులను కూడ వాళ్ళడ్డగించారు. ఆ వేళ వేణుకి కాలేజీ అంతా చూపించాలనే ఉద్దేశ్యంతో ఎట్లాగా కాలేజీ ఎగకొట్టేద్దామనుకున్న రామం పుస్తకాలు తీసుకురాకుండానే బయలు దేరడం కొంత మెరుగయింది. వేణు కూడా మొన్నటిదాకా కాలేజీ విద్యార్థిగా! ఆ కళలెక్కడికి పోతాయి? అందువల్ల వాళ్ళిద్దర్నీ లీడర్సు వెళ్ళనివ్వలేదు. ఆఖరికి వేణు తనకు వచ్చిన అప్పాయింట్‌మెంట్ ఆర్డరు చూపెట్టి వాళ్ళకు నచ్చచెప్పి రామంతో కాలేజీలో అడుగు పెట్టడానికి దేవతలు మందరగిరితో క్షీరసాగరాన్ని మథించి అమృతాన్ని సంపాదించినంత ప్రళయమైంది.

కాలేజీ ఆఫీసులోకి వెళ్ళబోతున్న వేణు లేడీ స్టూడెంట్స్ రూమువైపు చూసి ఠక్కున ఆగిపోయాడు. రామం అతనివైపు తెల్లబోయి చూశాడు. వేణు ఎటు చూస్తున్నాడో రామం క్షణంలో గుర్తించేశాడు.

"ఎవతెరా ఆ వరూధిని? రేదర్, రంభ!...." అని నెమ్మదిగా గొణిగాడు వేణు.

"అయిందీ! నువ్వు పడ్డావన్నమాట! ఇక నీ గురుత్వం ఏడిసినట్లే" అన్నాడు రామం.

"అబ్బ! చంపక చెప్పరా? ఆమె పేరు? మాధవియా! మాలతియా! మనోరమయా! భానుమతియా!...."

"బామ్మరా!" అన్నాడు రామం ఠపీమని.

అంతవరకు ఏదో మధురనామగ్రహణం చేద్దామనుకున్న వేణు వికసితవదనం ఆముదం తాగినట్లు నీళ్ళు కారిపోయింది. అతన్ని చూసి రామం ఫకాలుమని నవ్వాడు.

"సెప్టెంబరు పరీక్షలో ఇంగ్లీషు తప్పినప్పుడు కూడా నా ముఖం ఇట్లా వుండదురా" అన్నట్లు వేణు ముఖకవళికలు చెప్తున్నాయి.

"ఛ! అదేం పేరురా? వేళాకోళాలాడక నిజం చెప్పరా?" అన్నాడు వేణు ప్రాధేయపడ్తూ.

"నిజం రా! అది అబ్రివేటెడ్ నేమ్. సింపిల్‌గా 'బామ్మ' అంటారు మా కాలేజీ మేట్సంతా.

అసలు పేరు ఎవరికైనా తెల్సునో తెలియదో నాకు తెలియదు కాని మావాళ్ళు పెట్టినపేరు 'బాపూ బొమ్మ' అని. మరి అట్లాగే వుంది కదూ!"

"నిజ్జంగారా! కళ్ళు జిగేల్‌మంటున్నాయి."

"ఒకటి. మా వాళ్ళకు పూర్తిపేరు ఉచ్చరించడం యిష్టం లేకపోయింది. మధ్యనున్న రెండక్షరాలు తొలగించి సింపిల్‌గా 'బొమ్మ' అని సవరించారు."

"ఛ! ఛ! బుర్రలేనివాళ్ళు. అంత అందగత్తెను 'బొమ్మ' అని నోరార ఎట్లా అనబుద్దేస్తోందిరా?"

"సరే! మనమిక్కడే యింకాసేపుంటే ఏ తాతనో, ముత్తాతనో పేర్లు పెడతారు, నడు" అన్నాడు రామం.

వేణు విరహంలో చిక్కుకున్న వాడిలా ముఖం పెట్టాడు. ఆ వేళే వేణు డ్యూటీలో చేరాడు. కాని కాలేజీ స్ట్రయిక్ వల్ల క్లాసెస్ లేవు.

రెండురోజులు గడిచిపోయాయి. వేణు కాలేజీకి దగ్గరలోనే గాంధీనగర్‌లో ఒక రూము తీసుకున్నాడు. రోజూ ఏ హోటలువద్దనో మిత్రులిద్దరూ కల్సుకుంటూ ఉంటారు. ఆరుగంటల వరకు గోదావరీ నదీ తీరంలో మునిసిపాలిటీ సువాసనలను ఏమాత్రం పీల్చకుండా ఉండాలని ప్రయత్నించి విఫలులై తేమగాలులలకోసం ప్రాకులాడతారు.

ఒకరోజున కాలేజీనుంచి బయలుదేరిన రామాన్ని వేణు కల్సుకున్నాడు తుఫానులా వచ్చి. సిటీ బస్సులో వేణు వెళ్ళవద్దంటే యిద్దరూ కబుర్లు చెప్పుకుందామని రోడ్డు మీద నడవసాగారు.

"ఏరా! నన్ను పాలముంచినా నీట ముంచినా నీదే భారం రా!" అన్నాడు వేణు సమయం, సందర్భం, బిగినింగ్ వగైరాలు లేకుండా.

"బహుశ నీకు ఉత్తరం వచ్చిందేమిట్రా?" అన్నాడు రామం విసుగ్గా.

"ఎక్కడినుంచి?" తెల్లబోతూ అడిగాడు వేణు.

"అంగారక గ్రహం నుంచి; లేకపోతే యమలోకం నుంచి."

వేణు నొచ్చుకున్నాడు "లేకపోతే, ఏమిట్రా! నీ వెధవ అసందర్భపు ప్రశ్నలూ, నువ్వూ!" అన్నాడు రామం ఏడవబోతున్న వాని నూరుకోబెట్టడానికి.

"అది కాదురా! ఆ బాపూబొమ్మలేదూ! ఆమె ఫస్టు బి.ఎస్‌సి. చదువుతోంది. ఆమె క్లాసును కూడా నేను కండక్టు చెయ్యాలిట!"

"అయితే యికనేం? నీ రొట్టె విరిగి నేతిలో పడిందన్నమాట!"

"అబ్బే! రొట్టెకు పిండిసిద్ధం చేసుకున్నానంతేరా! జరపవల్సిన గ్రంధం చాలా వుంది; ఆమెతో పరిచయం చేసుకోవడమెట్లాగ? కాస్త సలహా యివ్వరా భాయి!"

"బాగానే వుంది. రోలు వెళ్ళి మద్దెలతో మొరపెట్టుకున్నట్లు వుంది! సరే నేనేం చెయ్యగలను? నీకేమంచి అవకాశాలున్నాయి కదా!"

"నువ్వు మంచి కథకుడవు కదరా! బాగా ఆలోచించి ప్లానువెయ్యి. ఆమెతో క్లోజ్‌గా

మాట్లాడే అవకాశం కోసం చూస్తున్నాను. ఒక ఉత్తరం వ్రాస్తే!"

"ఏమని వ్రాస్తావు?"

"అదీ నువ్వే చెప్పాలిరా! ప్లీజ్! సేవ్ మీ డియర్ రాం!"

"సరే, ముందుకొన్ని క్లాసులు కండక్ట్ చేశాక ఆమెకే ఎక్కువగా టీచ్ చేస్తూ వుండు. దానితో కొంత పాకం రంజుకావచ్చు. కృషితో నాస్తి దుర్భిక్షం! అన్నారుగా పెద్దలు."

వేణు దీర్ఘంగా నిట్టూర్చాడు. "సరే! ఈ విషయంలో నువ్వే నాకు గురువ్వు సుమా!"

"కాని నువ్వు కాలేజీ విద్యార్థులకు గురువ్వన్నమాట మర్చిపోతే, నిక్‌నేమ్స్ రావడం కాకుండ అభాసుపాలవుతావు జాగ్రత్త!" అన్నాడు రామం.

తర్వాత యిద్దరూ విడిపోయారు. వారం రోజులు గడిచిపోయాయి. తిరిగి యిద్దరూ ఒకనాడు మునిసిపల్ పార్కులో కలుసుకున్నారు. ఏకాంతంగా పచ్చికపై ఒకచోట కూలబడ్డారు. ఆలిండియా రేడియోలోంచి వచ్చే బృందగానంకంటె మించిన ఉచ్ఛస్వరంతో వేణు తన గోడు ప్రారంభించాడు.

"ఒరేయ్! చాల వివరాలు సేకరించానురా! ఆమెపేరు శశికళ. ఫిజిక్సు రికార్డు ఆమె యిస్తుంటే చూశాను. ఎట్లాగైనా ధైర్యంగా ఆమెతో మాట్లాడగల్గుతున్నాను. కాని, వ్యవహారాల్ని ఎట్లా నడపాలో నాకర్థం కావడం లేదు. ఆమె విషయంలో యింటరెస్ట్ తీసుకున్నా ఆమె నన్ను ఫక్తు గురువుగారిలాగునే చూసుకుంటోంది. మొన్న డిబేట్‌లో బాగా మాట్లాడింది. నేను కంగ్రాట్యులేట్ చేశాను. సింపుల్‌గా థేంక్స్ చెప్పి వూరుకుంది. ఇక నా ప్రేమను ఆమెకు వ్యక్తం చెయ్యకుండా ఉండలేనురా!" అన్నాడు వేణు.

"ప్రేమ అంటూ చెయ్యిపట్టుకునే దానికి ముందు నీ ముప్పయి రెండు పళ్ళు యిన్సూరు చేసి మరీ వెళ్ళరా!" అన్నాడు రామం వ్యంగ్యంగా నవ్వుతూ.

"నేనింత సీరియస్‌గా మాట్లాడుతూ వుంటే నీకు ఉత్త చెత్తబుట్ట మాటల్లా తీసి పారేస్తావేమిరా? నీవెట్లాగయినా ఒక ఉత్తరం వ్రాసి పెట్టరా! మంచి పదజాలంతో నేను వ్రాసినట్లు తెలుగులో వ్రాయి."

"ఎట్లా పంపుతావు? కాలేజీ లెటర్‌బాక్సులో పడవేస్తే కవరనేసరికి మావాళ్ళు దాన్ని చంపి చిత్రవధ చేసి వార్తా ప్రచారం చేసేదాకా వదలరు. పత్రికలలో పెద్ద అక్షరాలతో ఫిజిక్సు డెమన్‌గారి ప్రేమగోల అని ప్రచురిస్తారు. తెల్సిందా?" అన్నాడు రామం.

"అయితే, ఆమె కాలేజీ ఎడ్రసుకి రిజిష్టర్డ్ పోస్టులో పంపుతాను."

"మరి కేరాఫ్ ఎడ్రసు ఎవరిదిస్తావు? లేకపోతే రిజిస్ట్రేషన్ ఎట్లా?"

"నీ ఎడ్రసు యిస్తాను."

"అది నా ప్రాణం మీదకు వస్తే! డిబార్ చేసి పారేస్తారు. ఇంటికివెళ్ళి చెంబూ తప్పేలా తోముకోవాలి. లేకపోతే సోడా, బీడా అనుకుంటూనో, ఏరువాక పాడుకుంటూనో పోవాలి. పెద్ద చదువులంటూ వచ్చిన మన కట్లాంటివి నామోషీ. అంటే బుద్ధి వక్రిస్తే ఏడుకొండలవాని

దర్శనం కాకుండానే కనుబొమ్మలతో సహా దగ్గరలో వున్న బి.సి. నాటి షేవింగ్ సెలూన్‌లో గొరిగిపారేస్తారు. ఎవరు? ఆఖరికి మా మిత్రులే.... ఇంతవరకు నేను మంచి బుద్ధిమంతుడని మా బృందం నమ్ముతున్నారు. దయయుంచి నన్ను నీ ప్రేమ గొడవలో ఇరికించకురా! డిగ్రీ తెచ్చుకున్న నీకేమీ ఫర్వాలేదు. అంతగా వస్తే ఉద్యోగం ఊడడంతో సరి!...." అని రామం నిట్టూర్చాడు.

"అయిందా నీ ఉపన్యాసం! ఇంత బీదార్పులరుస్తావేమిట్రా! నేను స్నేహితుడనై వుండి నిన్నింతవరకు రానిస్తానా? అంతగా వస్తే నేనే ఆ ఉత్తరం వ్రాశానని అంటాను. నాకెందుకో ఆమెకు ప్రేమలేఖ వ్రాయాలని అనిపిస్తోంది. ఫలితం భగవంతుని చేతుల్లోనే వుందనుకుందాము. వెంటనే వ్రాయి...." అన్నాడు వేణు బ్రతిమాలుతూ.

ఇక తప్పదని రామం ఒక ప్రేమలేఖ గుండ్రని అక్షరాలతో వ్రాయసాగాడు. వేణు రామం వ్రాతను చూస్తూ మధ్య మధ్య సందేహాలు తీర్చుకోసాగాడు. చివరకా ఉత్తరం పూర్తి చేశాడు రామం.

'ప్రియమైన శశీ!

నేనిటువంటి ఉత్తరం వ్రాస్తానని నీవెప్పుడూ అనుకొని వుండవు. ప్రేమగాథలు సినిమాల్లోను, కథల్లోను తప్ప వాస్తవిక జీవితంలో లేవని నా మిత్రుడు వాదిస్తూ ఉంటాడు. కాని, నా హృదయాంతరంగాలు మథించి ఆత్మ సౌందర్యాన్ని ఆస్వాదించగల కళాకారుల కనుసన్నలలో మెలుగుతున్న మనకది సాధ్యం కాకపోదని నా వాదన. నేను క్రొత్తగా కాలేజీలో డిమాన్‌స్ట్రేటరుగా అప్పాయింట్ అయ్యానని నీకు తెల్సు. కాలేజీలో కడుగు పెడుతూనే నిన్ను చూసి సర్వ ప్రపంచాన్ని మర్చిపోగల ఫీలింగ్స్ నాలో కలిగాయి. నిన్నంతా 'బాపూ బొమ్మా!' అని పిలుస్తూ వుంటారని నా స్నేహితుని ద్వారా విన్నాను. నిజంగా ఆంధ్రపత్రికలో ప్రచురణ అయ్యే 'బాపూ బొమ్మ'లాగనే నువ్వుంటావు సుమా! శశీ! ఇక నేను దాచుకోలేను. నీకంటి చూపుల తూపులకు నా హృదయ కుసుమం చిల్లులు పడి ఏవో తీయని బాధల్ని కలుగజేస్తోంది. ప్రపంచంలో కిప్పుడిప్పుడే తొంగిచూస్తున్న మనం మంచి అవకాశాలకోసం వెదకటంలో ఆశ్చర్యంలేదు. నిన్ను నేను మనసారా ప్రేమిస్తున్నాను. ఇవి ఉత్తర కుమార బీరాలు కావు. యువకుడివైవుండి ప్రేమ దేవతను ప్రసన్నురాల్ని చేసుకోవడంలో నాకు గల హక్కును ఎందుకు సద్వినియోగం చేసుకోకూడదు? నువ్వు కూడా మంచిగా ఆలోచించి నిర్ణయించుకో. ప్రత్యక్షంగా అవకాశమిస్తే మాట్లాడతాను. వెంటనే నేనిచ్చిన ఎడ్రసుకి ఉత్తరం వ్రాయి.

– నీ ప్రియమైన వేణుగోపాల్.

"అమ్మయ్య! చాలా బాగుందిరా! ఈ వేళే దీన్ని పోస్టు చేస్తాను" అన్నాడు వేణు ఆ ఉత్తరం చదువుకుని.

రామం వేణు భుజం తట్టాడు ఉలిక్కి పడేలా. "ఒరేయ్! తీరా ఉత్తరం అందేక యీ

వివరాల్ని బట్టి అది నీవే వ్రాసావని ఆమె తెల్సుకుంటుందనుకో! కోపం వచ్చి ప్రిన్సిపాలుకి చూపెడితే తర్వాత నువ్వు సంజాయిషీ యిచ్చుకోవడం మాటటుంచి కాలేజీ విద్యార్థుల చేతుల్లో నల్లివైపోతావు జాగ్రత్త! దీనికింకో పథకం వెయ్యాలి..." అన్నాడు.

"నువ్వన్నదీ నిజమే! ఆ ప్లాను కూడా నువ్వేవెయ్యి" అన్నాడు వేణు.

రామం కొన్ని క్షణాలాలోచించాడు. "ఎందుకైనా మంచిది. నేనింకోపని చేస్తాను. శశికళే నీకొక ప్రేమలేఖ వ్రాసినట్లు వ్రాస్తాను. అవసరం వచ్చినప్పుడు అది నీవు బయటపెట్టి ఎవడో తుంటరి చేసాడని తప్పించుకోవచ్చు" అన్నాడు రామం. అతని ఐడియాకు వేణు 'మెచ్చుకొని మేకతోలు కప్పానురా నీకు!' అన్నాడు.

ప్రియమైన వేణుగారికి,

మీరు డిబేటింగయ్యాక నా స్పీచ్‌కి మెచ్చుకున్నప్పటినుంచీ నా హృదయంలో తీయని ఊహలు కలిగాయి. యువకులైన మీకు, విద్యావంతులైన మీకు.... ఒక సంస్కారియైన యువతి మనస్సు అర్థం అవుతుందనే వ్రాయగల్గుతున్నాను. నేను మిమ్మల్ని ప్రేమించి హృదయాధినాథులుగా పూజిస్తున్నానని భావించండి. మీరు తెల్పినప్పుడు ఏకాంతంలో కల్సుకొని మాట్లాడగలను. ఎప్పటికీ మీ ప్రేమనే కోరుకునే –

– మీ ప్రియ శశి

"అరే బచ్చా! నాకు నచ్చావురా!" అన్నాడు వేణు. ఆ ఉత్తరం చదివి ఆనందం పట్టలేక రామం వీపు చరిచాడు.

"నా మాటకేం, నువ్వామెకు నచ్చాలి. వ్యవహారం బెడిస్తే, సాపు కాబోయే వీపు అదుపులో పెట్టుకోవడం ఎందుకైనా మంచిది."

"ఏడిశావ్!" అన్నాడు వేణు పరిహాసంగా.

ఆ మరునాడే ఆ రెండు ఉత్తరాలు యిన్నీసుపేట బజారు పోస్టాఫీసులో పోస్టు చేశాడు వేణు. కాలేజీకి ఏమీ ఎరగనట్లు వెళ్ళిపోయారు.

నాల్గుగంటలకి వేణువచ్చి రామాన్ని కల్సుకున్నాడు. తనకు శశి వ్రాసినట్లు పంపుకున్న ఉత్తరం అందిందని చెప్పాడు. శశికళకా రిజిష్టర్డ్ లెటర్ అందిందీ లేనిదీ వాళ్ళకు తెలియలేదు.

మరునాడు స్టాఫ్‌రూమ్‌లో ఉండగా 'వేణుగోపాల్‌గారికోసం ఎవరో బయట నిలబడి వున్నారని' ప్యూను వచ్చి చెప్పాడు వేణుతో. వేణు బయటకు వెళ్ళి ఆ వ్యక్తిని చూసాడు. ఆయనకు నలభై ఏళ్ళుంటాయి. నిరాడంబరంగా ప్రశాంత వదనంతో చూడగానే ఎదుటివారు నమ్రతకల్గి ప్రవర్తించేలా ఉన్నాడు.

ఆయన చిరునవ్వు నవ్వి, "మీరేకదండీ, వేణుగోపాల్‌గారు?" అని అడిగాడు.

వేణుకి ఆయనెవరో అర్థమైపోయింది. ఒకసారి గుండెలు టకటక కొట్టుకొని ఆగిపోయినట్లనిపించిందతనికి. "నేనేనండి" అని మాత్రం అనగల్గాడు.

"ఒకసారి మీతో మాట్లాడాలి. నాతో వస్తారా? ఇప్పుడు లీజర్‌గానే ఉన్నారుగా!" అని

అడిగాడాయన. వేణు తలపంకించి ఆయన వెన్నంటాడు.

కాలేజీకి ప్రక్కగా వున్న చెట్లచాటుకి పోయారిద్దరూ. ఆయన కొన్ని క్షణాలాగి, "వేణుగారూ! ఈ ఉత్తరం చూడండి!' అని దాన్ని యిచ్చాడు. అది రామం వేణు వ్రాసినట్లు శశికళకు వ్రాసినదే!

"ఏమిటి?" అని నర్మగర్భంగా వేణు అన్నాడు అది చదివినట్లు నటించి.

"ఇది మీరు వ్రాశారా?"

వేణుపని ఇరుకున పడింది. "నాకిదేమిటో అర్థం కావటం లేదు. నేను వ్రాయలేదు" అని బలవంతంగా అన్నాడు.

"ఇదెవరో తుంటరిపిల్లలు చేసిన పని. నాకు మీ పరువు తీయడం ఇష్టం లేదు. మా అమ్మాయి మీరటువంటివారు కారని తెల్పడం వల్ల నేనే స్వయంగా యీ విషయం కనుక్కుందామని వచ్చాను. ఏమైనా యీ ఉత్తరం ప్రిన్సిపాలుకు చూపడం మంచిదేమో!" అన్నాడాయన అర్థోక్తిలో.

"ఎందుకు? నాకూ మీ అమ్మాయి వ్రాసినట్లు ఒక ఉత్తరం వచ్చింది" అంటూ గత్యంతరం లేక వేణు తనవద్దనున్న ఉత్తరం ఆయనకు చూపాడు. అది ఆయన చదివి తల పంకించాడు.

"ఈ రెండు ఉత్తరాలలోని దస్తూరీ ఒకరిదే! ప్రయత్నిస్తే వీడెవడో దొరుకుతాడేమో! డిబార్ చేయించి బుద్ధి చెప్దాము" అన్నాడాయన కఠినంగా.

వేణు నీళ్ళుకారిపోయాడు. "ఎందుకులెండి? ఏదో జరిగిపోయింది. ఈ సంఘటన జరగలేదనే అనుకుందాం! నాకు టైమవుతోంది. పోయి వస్తాను" అని ఆయన సమాధానమైనా వినకుండా వెనుదిరిగి వెళ్ళిపోయాడు వేణు.

రామాన్ని కలుసుకున్నాడు వేణు. ఏం జరిగిందని రామం కళ్ళతో ప్రశ్నించాడు.

"అంతా అభాసయిందిరా!" అన్నాడు వేణు. వివరంగా అంతా చెప్పాడు.

"నే చెప్తే విన్నావా? సరే, ఇప్పటికీ కొంత మెరుగే! ఇకనయినా ఆ బొమ్మగార్ని మర్చిపోయి ఇన్సూరెన్సు ప్రీమియం వాయిదా దాటకుండా కడుతూ వుండు" అన్నాడు రామం పరిహాసంగా.

అప్పుడే శశికళ ఉరఫ్ 'బాపూబొమ్మ' తన స్నేహితురాలు రజనితో అదే వరండా చివరకు వచ్చి వేణు, రామం దగ్గరగా వుండి మాట్లాడడం చూసింది. ఆమెను వాళ్ళు గమనించలేదు.

"మన డెమన్‌గారి ప్రక్కనున్న అతనెవరే" అని అడిగింది శశికళ.

"ఫైనలియర్ స్టూడెంట్. మంచి కథలు వ్రాస్తుంటాడు. పేరున్నవాడే! మరి కొత్తగా వచ్చిన డెమన్‌గారితో అప్పుడే అంత క్లోజ్‌గా మూవ్ అవుతున్నాడంటే ఆశ్చర్యంగానే ఉంది."

"పేరు నీకు తెలుసా?"

"మా రూముమేటు అతని క్లాసుమేటు కదూ! అతని పేరు 'రామచంద్ర' అని చెప్పిందొకసారి."

"ఓహో!" అంది శశికళ తనకు జాబు వ్రాయబడిన ప్రేమలేఖలోని కేరాఫ్ ఎడ్రసు జ్ఞప్తికి

తెచ్చుకుంటూ. ఆమె ముఖం థళ థళ మెరిసింది, పరీక్ష ప్యాసయినంత ఆనందం వెల్లివిరిసింది.

"ఎందుకే ఈ వివరాలన్నీ నీకు?" అని రజని అడిగింది.

"తర్వాత చెప్తాగా!" అంది శశికళ.

ఆవేళ మధ్యాహ్నమే శశికళకు ఫిజిక్సు ప్రాక్టికల్ క్లాసు ఉంది. వేణు డిమాన్‌స్ట్రేట్ చేయడానికి వచ్చినప్పుడు ఇదివరలా శశికళను పరికించడానికి జంకాడు. కొంతసేపటికంతా ఎవరి ఎక్స్పెరిమెంట్సులోకి వాళ్ళు వెళ్ళిపోయారు.

శశి వేణు దగ్గరగా వచ్చి లెసన్ మళ్ళీ చెప్పించుకొని, ఆఖరున, "రామచంద్రగారు మీకు మిత్రులా" అంది ఠక్కున. వేణు త్రుళ్ళి పడ్డాడు. నీరసంగా అవునన్నట్లు తల ఊపాడు తనకు తెలియకుండానే!

"ఎక్కడ మిత్రులయ్యారు?" అని అడిగింది ఆమె.

"మేమిద్దరం అనంతపూరులో యింటర్ క్లాసుమేట్సుము...."

ఓహో అన్నట్లు తలపంకించి తన సీటులోకి వెళ్ళిపోయింది ఆమె. వేణు ఆమె ప్రవర్తనకు ఆశ్చర్యపడి ఆమె వేసిన ప్రశ్నలనే మననం చేసుకుంటూ ఉండిపోయాడు. అసలా వుత్తరాల గొడవ జరిగినట్లే ఆమె పట్టించుకోవడం లేదు.

నాల్గు గంటలకు కాలేజీ బయట వేణు, రామంలు కల్సుకున్నారు. శశి అడిగిన ప్రశ్నల విషయం చెప్పి, "నీకూ ఆమెకూ యిదివరకే పరిచయ ముందేమిట్రా?" అని వేణు అడిగాడు.

రామం తెల్లబోయి, "ఆమెను దూరాన్నుంచి చూడడమే కాని ఎప్పుడూ దగ్గరకు వెళ్ళి పలకరించలేదు. ఆమెకు నా పేరూ, వివరాలు ఎట్లా తెలిశాయో అర్థం కావడం లేదు. అయినా ఆమె నన్ను ఏ డిచ్‌లోకయినా యీడ్చుకుపోదుకదా! నీ ప్రేమగోలే యింత వరకు తీసుకువచ్చింది" అన్నాడు విసుగ్గా.

వేణు దీనంగా ముఖం పెట్టాడు. ఈస్తటిక్ సెన్సు అవతరించింది రామంలో. "సరేలే! చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఏం లాభం? ఏం జరుగుతుందో చూద్దాం!" అన్నాడు రామం. వేణు ఏడవడం యిష్టంలేక, వెంటనే రాబోదామనుకున్న కన్నీటిని వెనక్కి గ్రంధులలోకి పంపేశాడు ఫిజిక్సు డెమన్ వేణుగోపాల్!

ఆ రెండోనాడు కాలేజీనుంచి యింటికి వచ్చేటప్పుడు రామం వెంట సూర్యనారాయణ గారింటికి వచ్చాడు.

అక్కడ శశికళ తండ్రి సుబ్బారావుగారిని చూసేసరికి మిత్రులిద్దరూ కొయ్యబారిపోయినట్ల య్యారు. సూర్యనారాయణగారు, ఆయన ఏవేవో కులాసాగా నవ్వుతూ కబుర్లు చెప్పుకోవడం వారిని మరింత ఆశ్చర్యంలో ముంచింది.

వాళ్ళను చూడగానే సూర్యనారాయణగారు, "వాడేనండి మా రామం! అతను ఫిజిక్సు డిమాన్‌స్ట్రేటరు వేణుగోపాల్" అన్నారు పరిచయం చేస్తూ.

కంగారునణుచుకుంటూ మిత్రులిద్దరూ సుబ్బారావుగారికి నమస్కరించారు. కొంతసేపు కాలేజీ కబుర్లు వారి మధ్య దొర్లిపోయాయి.

ఇంతలో హఠాత్తుగా, "ఏమోయ్! ఈ ఉత్తరాలు చదివిపెట్టవోయ్!" అని సుబ్బారావుగారు రామం తానిదివరకు వ్రాసిపెట్టిన రెండు ఉత్తరాలు అతని చేతికిచ్చారు. రామం, వేణు కంగారుపడిపోయారు. కొన్ని క్షణాలు వారి మధ్య నిశ్శబ్దం తాండవమాడింది.

రామం తేరుకొని తన మామయ్యవైపు, సుబ్బారావుగారివైపు చూశాడు. వారి ముఖంలో దాగిన మందహాసం అతన్ని నిజం చెప్పడానికే పురికొల్పింది. "మీ కీపాటికంతా అర్థమయ్యే వుంటుంది. ఇక నేను వేరే చదివి అర్థం చెప్పాలా? ఇందులో నా తప్పు ముఖ్యమైనదే! జరిగినది ఏమైనా నన్ను క్షమించండి. నాలో దురుద్దేశ్యం మాత్రం లేదు. మీకు శ్రమ కలిగించాను" అన్నాడు రామం దృఢంగా.

"ఇదుగో! నీ స్నేహితురాలుట! ఉత్తరం యిచ్చివెళ్ళింది" అంటూ రామం అత్తయ్య ఒక కాగితం పట్టుకు వచ్చి యిచ్చింది నవ్వును దాచుకుంటూ. రామం ఆత్రుతగా దాన్ని తీసుకొని చదివాడు.

'ప్రియమైన రాం!

ఈ విధంగా జరుగుతుందని ఎవరు అనుకోలేదు. మీరు వ్రాసిన రెండు ఉత్తరాల వల్ల మిస్టర్ వేణు తనకేం సంబంధం లేనట్లు తప్పించుకున్నా వేణుకి తెల్సిన వ్యక్తే యివి వ్రాసి వుంటారని గ్రహించాను. అప్పుడే కాలేజీ వరండాలో మీరు వేణుతో మాట్లాడడం చూసి మీ అతి సాన్నిహిత్యాన్నికి ఆశ్చర్యపడి వివరాలు సేకరించాను. ఆ ఉత్తరాలు మీరు వ్రాసినవి రూఢి పర్చుకోడానికి నిన్న మీరు కాలేజీకి వెళ్ళినప్పుడు మీ యింటికి వచ్చాను. మీరు వ్రాసిన కథల పుస్తకాలు, మీ స్నేహితురాలనని చెప్పి అడిగి పుచ్చుకున్నాను. వాటిలోని దస్తూరీతో పోల్చిచూసుకుని మీరే ఈ గ్రంథకర్తలని నిశ్చయించుకున్నాను. ఈ అనుకోటి సంఘటనల వల్ల మన పూర్వబంధుత్వాలు బయటపడ్డాయి. మనం చాలా కావాల్సిన వాళ్ళమట! మా నాన్నగారు సూర్యనారాయణ బాబయ్యగారితో మాట్లాడటానికక్కడికి వస్తున్నారు. త్వరలో కలుసుకోవాలని ఆశిస్తూ...

–మీ బాపూబొమ్మ 'శశి'.

నవ్వాలో, ఏడ్వాలో కూడ అర్థంకానట్లు రామం, వేణు ఒకరి ముఖాలింకొకరు చూసుకున్నారు. వేణు తేలిగ్గా నవ్వేశాడు. రామం కుదుటపడ్డాడు.

ఇంతలో వేణుకి ఎక్స్‌ప్రెస్ టెలిగ్రాము వచ్చింది. వాల్తేరులో ఎమ్.ఎస్‌సిలో సీటు దొరికినట్లు. ఇదివరకు రాజమండ్రీ వచ్చేటప్పుడు కేరాఫ్ ఎడ్రసులో సూర్యనారాయణగారి దివ్వడం వల్ల వాల్తేరులో వున్న మిత్రుని ద్వారా ఆ టెలిగ్రాము వేణుకి అందింది. అంతా ఆ విపరీత పరిణామానికి ఆశ్చర్యపోయి నవ్వుకున్నారు.

●